

13న కృత్రిమ అవయువాల క్యాంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 13వ తేదీ తిరుపతి, చిత్తూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు తపోవనంలో కృత్రిమ అవయాల కొలతలు తీసుకోనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి శ్రీనివాస్ తెలిపారు. కొలతలు తీసుకున్న 20 రోజుల తరువాత కృత్రిమ అవయాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. కృత్రిమ అవయాల కోసం వచ్చే వారు అధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం మెడికల్ సర్టిఫికేట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకు రావాలన్నారు. వివరాల కోసం రాజశేఖర్ నాయుడు 94403 57522 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. అక్టోబర్ 4,7 తేదీల్లో కృత్రిమ కాలు తీసుకోన్న లబ్దిదారులు ఈ క్యాంపుకు రావాల్సిన అవసరం లేదన్నారు.

సామాన్యునిపై స్మార్ట్ ఎటాక్...



- పేద వర్గాలపై విద్యుత్ చార్జీల మోత
- కూటమి కుట్రలో సంపన్నుల హస్తం
- టెక్నాలజీ పేరిట వెన్ను విరిచేందుకు పన్నాగం
- అయోమయంలో బడుగు వర్గాలు

ప్రజాశక్తి- పూతలపట్టు: నాడు వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలియగానే.. కూటమి ప్రభుత్వం మండిపడింది. ప్రజలపై విద్యుత్ భారం పడుతోందని రాద్ధాంతం సృష్టించింది. అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను పక్కన పెడతామని.. ప్రజలపై విద్యుత్ భారం మోపబోమని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి రాగానే వినియోగదారులపై సర్దుబాటు చార్జీల భారం మోపింది. ఇంధన సద్దుబాటు చార్జీల భారం లేకుండా రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవే చార్జీలు పెంచి వినియోగదారుల నెత్తిన భారం వేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న పేద మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ చార్జీల మోత మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు అయ్యింది. వినియోగ విద్యుత్ యూనిట్ ధర పెంచకుండా గతంలో వాడిన విద్యుత్తుపై సర్దుబాటు చార్జీలు పేరుతో ఇప్పుడు వసూలు చేసే అంశంపై ప్రజల నుంచి వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు అంటూ స్మార్ట్ మోసానికి తెర లేపుతున్నట్టు తెలుస్తోంది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల ఏ ప్రాంతంలో ఏ మేరకు విద్యుత్ వినియోగం కిందికి లో వోల్టేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమాచారం విద్యుత్ అధికారులకు వెంటనే అందుతుంది. వీటిని సాకుగా చూపి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో విద్యుత్ బకాయిలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బిల్లుల్లో ప్రభుత్వం చెల్లిస్తున్న నామమాత్రపు సబ్సిడీ కంటే వేసిన భారం ఎక్కువగా అనిపిస్తోంది. వినియోగదారులపై కనీసం వంద రూపాయలు అదనపు భారం పడుతుంది.


> పేద, బడుగు బలహీన వర్గాలపై కాల'కూటమి' విషం చిమ్ముతోంది. ఇప్పటికే పన్నులు భారం మోపింది. నిత్యావసరాల ధరలతో ఇప్పటికే పేదలకు వాతలు పడ్డాయి. పెరిగిన కూరగాయల రేట్లుతో ఇప్పటికే చిన్నాభిన్నమైన పరిస్థితి. కాయకష్టం చేసుకొని బతుకెళ్లదీస్తున్న పేదవర్గాలు.. చిరుద్యోగంలో కాలం నెట్టుకొస్తున్న మధ్యతరగతి కుటుంబాలను ప్రభుత్వ స్మార్ట్ దందా కుదిపేస్తోంది. రెండు పర్యాయాల్లో అధికారాన్ని అనుభవించిన బిజెపి తన పంథాను మార్చుకుంది. ఎన్నికల వరకూ సామాన్యుడిని నయవంచనకు గురిచేసి ఎన్నికలు గడిచాక తన స్వరూపాన్ని భయపెట్టింది. తొలి నుంచి సంపన్నులతో దోస్తీకట్టి ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వాలను గుప్పెట్లోకి తీసుకొని దోచిపెట్టేందుకు సన్నద్ధమైనట్లే కనిపిస్తోంది. టెలి'కాం'గా దోచిపెట్టే విధానం నుంచి కొత్తపుంతలు తొక్కి విద్యుత్ వినియోగంలోనూ స్మార్ట్‌గా.. సైలెంట్‌గా ప్రైవేటు వ్యక్తులకు పేదవాని కష్టాన్ని దోచిపెట్టే విధానాలకు కూటమిగా శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చకచకా జరిగిపోతోంది.

నియోజకవర్గంలో..

పూతలపట్టు నియోజకవర్గంలో యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లి, పూతలపట్టు మండలాలు ఉన్నాయి. ఐదు మండలాల్లో 87,240 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 11,737 వాణిజ్య విభాగపు కనెక్షన్లు ఉండగా.. ఇప్పటికే 2656 స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు వంటి వాటికి ఏర్పాటు చేశారు. మండలస్థాయి అధికారులతో సమీక్షించిన అనంతరం గృహవాణిజ్య సముదాయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

రీఛార్జ్‌తోనే విద్యుత్ వినియోగం

ఇకపై స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ వినియోగానికి ముందస్తుగా రీఛార్జి చేసుకోవాలి.. ఒక విధంగా చెప్పాలంటే



సెల్‌ఫోన్లను రీఛార్జ్ చేసుకునే విధంగా చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జి అయిన వెంటనే విద్యుత్తు సరఫరా ఆగిపోతుంది. ఇకపై విద్యుత్ బిల్లులు ఇంటికి వచ్చే అవకాశం ఉండదు.

సామాన్యుల పరిస్థితి ఎలా..?

స్మార్ట్ మీటర్ల ద్వారా సామాన్య ప్రజలపై అధిక భారం పడనుంది. దీనికి తోడు మధ్యతరగతి నిరక్షరాస్యులు రీఛార్జి చేసుకొని విద్యుత్‌ను ఏ విధంగా వినియోగించుకుంటారన్న సందేహమూ ఉంది. సమయానికి డబ్బు లేకుంటే ఇక ఆ కుటుంబం చీకట్లో నలిగి పోవాల్సిందే. కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎనలేని భారాన్ని మోపుతోంది.

- కిరణ్, గృహ వినియోగదారుడు, పూతలపట్టు.



ప్రమాదకర నీటి ప్రవాహంలో ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు

ప్రవాహంలో ప్ర(మాదకర)యాణం

ప్రజాశక్తి- సోమల: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొదలకుంటపల్లి– నంజంపేట మార్గమధ్యంలోని దలవాయి చెరువు తూము వద్ద గండి ఏర్పడి కట్ట కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అటు తర్వాత ఇరిగేషన్ అధికారులు ప్రజాప్రతినిధులు మండలస్థాయి అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి వచ్చారు. అయితే తూము నిర్మించి కట్ట ఏర్పాటు చేయాల్సిన ఇరిగేషన్ అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోవడంతో పొదలకుంటపల్లి ఎం.వడ్డిపల్లి, సి.వడ్డిపల్లి, తుగడంవారిపల్లి గ్రామాలకు చెందిన వారు కట్ట కొట్టుకుపోయి నీటి ప్రవాహం వెళుతున్న మార్గంలోనే కష్టంగా ప్రయాణాలు సాగిస్తుండడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందని ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నంజంపేటకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ప్రవాహంలో ప్రమాదకరమైన ప్రయాణాన్ని సాగిస్తూ చదువులు కొనసాగించేందుకు వెళ్తున్నారు. మండల, జిల్లాస్థాయి అధికారులు ప్రజల ఇబ్బందిని గుర్తించి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయడమో లేక తూము, కట్ట నిర్మాణం వెంటనే చేపట్టడం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాణిపాకం ఈవో



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ని శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీలను సన్మానించి ప్రసాదాలను అందజేశారు.

గురువులేని గురుకులం

- విద్యార్థులతో పనులు..
- ఇదెక్కడి చోద్యమంటున్న తల్లిదండ్రులు


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గిరిజన విద్యార్థుల చదువు సంక్షేమం పేరిట మదనపల్లిలో ఏర్పాటు చేసిన గిరిజన గురుకులంలో గురువులు లేరు.. నాణ్యమైన భోజనమూ లేదు.. విద్యార్థులతో పనిచేయిస్తున్నారు.. తమపిల్లల చదువులు సాగడం లేదంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ గురుకుల పాఠశాల విద్యార్థులను కలిసి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము పడుతున్న ఇబ్బందులను గిరిజన విద్యార్థులు విద్యార్థి సంఘం నాయకుడి దృష్టికి తీసుకొచ్చారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, ఎనిమిది నెలలుగా ఫిజికల్ సైన్సు, ఇంగ్లీష్ టీచర్లు లేరని తమ చేత పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులు సిలబస్ పూర్తి కాక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల సమస్యలపై వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలకు సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.



వంట గదిని శుభ్రం చేస్తున్న విద్యార్థి

విన్నపాలు వినవలె..

పిజిఆర్ఎస్‌కు 241 అర్జీలు: కలెక్టర్



పిజిఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హీమ వంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిజిఆర్జఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతి అర్జీకీ అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్ధవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ–ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 241లు రాగా శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 201, సర్వే శాఖ 2, పోలీసు శాఖ 6, జిల్లా రిజిస్ట్రార్ 1, డిఎస్ఓ 6, పంచాయతీ శాఖ 1, జిల్లా విద్యాశాఖ 2, డిఆర్‌డిఎ 10, పశు సంవర్ధకశాఖ 5, రహదారులు భవనాల శాఖ 2, ఇరిగేషన్ 1, డిసిహెచ్ఎస్ 1, ఎంపిడిఓ ఐరాల 1, ఎంపిడిఓ ఎస్ఆర్ పురం 1, ఎంపిడిఓ వి కోట 1 వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ట్రైనీకలెక్టర్, డిఆర్ఓ, ఆర్‌డిఓలకు అందజేశారు. వివిద శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు తొమ్మిది వినతులు అందినట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. గతవారం అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం 5, పింఛన్లు 3, టౌన్ ప్లానింగ్ 1 చొప్పున మొత్తం తొమ్మిది వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎసీపీ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు అందుకుంటున్న కమిషనర్

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రజల నుండి 34 ఫిర్యాదులను స్వీకరించారు. ఒక వికలాంగుడు వచ్చాడని తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ అతని వద్దకు స్వయంగా వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను నిర్దేశిత గడువులోగా ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 34 ఫిర్యాదులు అందగా అందులో కుటుంబ తగాదాలు 7, వేధింపుల 3, ఇంటి తగాదాలు 4, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 5, దారి తగాదాలు 2, ప్రేమ వివాహం 1 ఉన్నాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ



కుప్పంలో 36 వినతులు

కుప్పం టౌన్ : కుప్పం పట్టణం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కడా పిడి వికాస్ మరమత్ ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 36 వినతులు అందినట్లు తెలిపారు. వీటన్నింటినీ పరిశీలించి ఆయా శాఖల అధికారులకు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమస్యలకు పరిష్కారం చూపాల్సిందిగా ఆదేశించారు. ఈ వేదిక ద్వారా అందిన వినతులలో ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలపై వినతులు అందడం గమనార్హం.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి

దశాబ్దాల చరిత్ర కలిగిన చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయం లేకపోవడం బాధాకరమని చిత్తూరులో కేంద్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటూ సోమవారం చిత్తూరు స్మార్ట్ సిటీ అండ్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ కేంద్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుపై సానుకూలంగా స్పందించారని ప్రెసిడెంట్ తాండవ మూర్తి, శివకుమార్, సత్య, గోపి నాయక్, అశోక్ కుమార్, చంద్రబాబు, శ్రీనివాసమూర్తి, శరత్ తెలిపారు.

పొలం పిలుస్తోంది.. అధికారులు రారే..?

- మొక్కుబడిగా పొలంబాట

ప్రజాశక్తి- విజయపురం

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రచారం ఎక్కువ పని తక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా, అనుబంధశాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజవుతుండటంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది.



విజయపురం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన అధికారులు (ఫైల్‌ఫోటో)

పొలం పిలుస్తోంది ఉద్దేశం..

రైతులు సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్న లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుంది. ఉదయం 8.30 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు అనుబంధశాఖల అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ (పొలం బాట) చేయవల్సి ఉంది. అలాగే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, సాయంత్రం 3 నుంచి వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధిన 14 సేవ అధికారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించాలి. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతోపాటుగా సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడులపై అవగాహన కల్పించాలి. అంతే కాకుండా అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనతో పాటు లోపాలు గుర్తించాలి. ఈ వివరాలు రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించి, పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకోవడం, సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం, భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్సహించడం జరుగుతుంది. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి.

మొక్కుబడిగా పొలంబాట..

పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడానికి ముందు రోజు పంచాయతీల్లో దండోరా వేయించాలి. అయితే ఎక్కడగాని ఏ గ్రామలంలో గానీ దండోరా వేసినట్లు దాఖలాలు కనిపించలేదు. దీంతో చాలా మంది రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రాలేకపోతున్నారు. వచ్చిన 10మందితో కార్యక్రమాన్ని మొక్కుబడిగా ముగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారులు దూరం..

పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయశాఖ అధికారులతో పాటు ఆత్మ, ఏపీ సీఎన్ఎఫ్, ఉద్యానశాఖ, సెరీకల్చర్, పశుసంవర్ధక శాఖ, ఏపీ స్టేట్ డెయిరీ డెవలప్మెంట్, కో ఆపరేషన్ ఫెడరేషన్, మత్స్యశాఖ, వ్యవసాయ మార్కెటింగ్‌తో పాటు కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం ఇలా పదికి పైగా శాఖలు హాజరు కావలసి ఉంది. కానీ వ్యవసాయశాఖలతో పాటు ఉద్యానశాఖ అప్పుడప్పుడూ పశుసంవర్ధకశాఖ తప్ప మిగిలిన వారు ఎవరు పాల్గొనడం లేదు. దీంతో ఈ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులే నిర్వహించి ఫ్లెక్సీలతో నాలుగు ఫోటోలు దిగి మమా అనిపించేస్తున్నారు.



నగరిలో వరిసాగు చేస్తున్న రైతులు

అధికారులు వస్తున్నారు..

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి కచ్చితంగా అన్ని అనుబంధ శాఖలూ హాజరు కావాలి. కొన్ని శాఖలకు చెందిన అధికారులు వస్తున్నారు. అన్ని మండలంలో జరుగుతున్నాయి కాబట్టి అప్పుడప్పుడు మన మండలానికి కూడా వస్తున్నారు. రైతులకు అన్ని విధాలుగా అవగాహన కల్పిస్తున్నాం.

– రజిని కుమారి, ఏవో, విజయపురం

అవగాహన లేక నష్టపోతున్న రైతాంగం

నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నింద్ర, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో సుమారు 25వేల మందికి పైగా రైతులు ఉంటారు. వారు ఇప్పటికే వివిధ రకాల పంట సాగు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా వరి సాగు ఎక్కువుగా సాగు చేస్తుంటారు. కొన్ని చోట్ల నాటు వేయగా, మరి కొన్ని చోట్ల పొలాలను దుక్కిదిన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో సుమారు 2000 హెక్టార్లలో వరి సాగులోకి రానుంది. అలాగే ఈ ఐదు మండలాల్లో సుమారు 3000 హెక్టార్లకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. అలాగే వేరుశెనగ, నువ్వులు, సన్‌ఫ్లావర్, ఉద్దులతో పటు వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. వీరికి సరైన అవగాహన లేకపోవడంతో రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు.


జెడ్‌పి అతిథిగృహాల పరిశీలన



శిథిలావస్థలో ఉన్న జెడ్‌పి గెస్ట్‌హౌస్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహాలను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ జిల్లా పరిషత్ అధికారులతో కలిసి పరిశీలించారు. గడిచిన కొన్నేళ్లుగా వినియోగంలో లేక శిథిలావస్థలోకి చేరిన ఈ అతిథి భవనాలను మళ్లీ వినియోగంలో తేవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఎమ్మెల్యే జిల్లా పరిషత్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. పాత భవనాలను రెనోవేషన్ చేస్తే సరిపోతుందా.. లేదా పూర్తిగా తొలగించి కొత్త భవనాలను నిర్మించాలా అనే అంశాలపై చర్చించారు. జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఈలు ప్రసాద్ నాయుడు, నవీన్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనం



వనభోజనాల్లో ఎమ్మెల్యేలు గురజాల, మురళీ మోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని కేజీ సత్రం గ్రామంలోని సిద్ధేశ్వర కొండలో సోమవారం కార్తీకమాస వన మహోత్సవ కార్యక్రమం గ్రామస్తులు చేపట్టారు. మొదట సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ నాయుడు, కలికిరి మురళీమోహన్, చుడ ఛైర్‌పర్సన్ కటారి హేమలత పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- శాంతిపురం: పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఎదురుగా ప్రారంభించబడిన బిఆర్‌డి క్లినిక్‌లో 10వ తేదీ మంగళవారం ఉచిత వైద్యపరీక్షా శిబిరంను నిర్వహించన్నున్నట్లు డాక్టర్ సురేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర సురేష్ బాబు , సీనియర్ గర్భకోశ వైద్య నిపుణులు డాక్టర్ హరిత, బిఆర్‌డి వైద్య బృందంచే బిపి, షుగర్, కడుపు నొప్పి, ఆయాసం, థైరాయిడ్, ఆపేండిక్స్, గర్భకోశ వ్యాధులు, సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స, గర్భిణి శిశువులల్లో లోపాలను తెలుసుకొనుటకు ప్రత్యేక స్కానింగ్, పాలోఫిన్ ట్యూబ్ బ్లాక్ అవ్వడం, ఫైబ్రాయిడ్ సమస్యలు, గర్భశయ ఆపరేషన్లు, స్త్రీ సంబంధిత అన్ని వ్యాధులకు, గొంతు, ముక్కు, నోరు సంబంధిత వ్యాధులకు, చిన్న పిల్లలకు సంబంధించిన అన్ని వ్యాధులకు ఈ శిబిరంలో వైద్యం అందించన్నున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో శస్త్రచికిత్సకు ఎంపికైన రోగులకు కుప్పం బిఆర్‌డి ఆసుపత్రిలో రాయితితో వైద్యసేవలు అందించడంతోపాటు ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒకరు వినియోగించుకోవాలని కోరారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన చల్లా



ప్రజాశక్తి- రొంపిచర్ల: పీలేరు పట్టణంలో సనా ఫ్యామిలీ రెస్టారెంట్ యాజమాన్యం ఆహ్వానం మేరకు ఫ్యామిలీ రెస్టారెంట్ నూతన బ్రాంచ్‌ను తెలుగుదేశం పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రారంభించారు. వారివెంట రొంపిచర్ల మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మదన్ మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దారి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కీలపల్లి గ్రామ పంచాయతీలో రైతులు వారివారి పొలాలకు ఎన్నో ఏళ్లుగా వెళుతున్న దారిని గ్రామానికి చెందిన ధర్మరాజులు అనే వ్యక్తి ఆక్రమించుకున్నట్లు గ్రామస్తులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమిని ఆక్రమించుకున్న వ్యక్తికి ఎటువంటి భూమిపై ఎటువంటి హక్కు లేనప్పటికీ ఆ స్థలం నాదీ అంటూ జెసిబితో దారిని తవ్వని దారి మధ్యలో మామిడి చెట్టు నాటాడని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మార్వో, పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్థలాన్ని పరిశీలించి యథావిధిగా దారిని ఏర్పాటు చేసి వెళ్లారని, అయితే అధికారులు పోలీసులు వెళ్లిన కొద్ది సేపటికే మళ్లీ అడ్డగించుకుని దారి లేకుండా చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని గ్రామ రైతులు అర్జీని కలెక్టర్‌కు అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ గంగవరం ఎంఆర్‌ఓకి ఫోన్ చేసి వెంటనే రైతులు సమస్యను పరిష్కరించి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. భూమిని ఆక్రమించిన వ్యక్తి సమస్య పరిష్కారం కానీకుంటే ఆ వ్యక్తిపై బైండోవర్ కేసుపెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న పశుగణన

ప్రజాశక్తి- సోమల: మండలంలో గతనెల 25వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పశు గణన కార్యక్రమాన్ని పశువైద్య సిబ్బంది నిర్వహిస్తూ వస్తున్నారు. సోమవారం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో నిర్వహిస్తున్న పశు గణన కార్యక్రమాన్ని పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిని చందన ప్రియ తనిఖీ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. జనాభా గణన ఏ విధంగా నిర్వహిస్తామో అదేవిధంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల కుక్కలు ఇతర అన్ని జీవాల లెక్కింపు కూడా చేయడం జరుగుతుందని దీనివల్ల ప్రభుత్వం అందించే మందులు ఇతర టీకాలు ఎన్ని అవసరమో తెలుస్తాయని చందన ప్రియ తెలిపారు.



పశుగణనను పరిశీలిస్తున్న వైద్యాధికారిని చందన ప్రియ

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశకి- పుంగనూరు: మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 77వ పుట్టినరోజు వేడుకలు పుంగనూరులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మురళీమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సోనియాగాంధీ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అయాబ్, రాయల్ ముబారక్, ఫయాజ్, షానావజ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి..

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు విజయలక్ష్మి, నీలిమ గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. పీఎం ఎస్ఎంవై కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆసుపత్రికి వచ్చిన 15 మంది గర్భవతులను వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. గర్భం దాల్చినప్పటి నుండి ప్రతివానంతరం వరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ప్రతినెలా వైద్యుల వద్ద వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని కోరారు. అవసరమైన వారికి మందులు మాత్రాలను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన సోమల, పెద్దఉప్పరపల్లి వైద్యశాలలలో కూడా గర్భవతులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో..



జిడి నెల్లూరులో..

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, సభ్యులు సోమవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సాయిశ్రీ, సిహెచ్.అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు.

గంగాధర నెల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంవి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు, చిత్తూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంవి.శ్రీధర్ రెడ్డి సహకారంతో మండల రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గంగాధర నెల్లూరు పీహెచ్‌సీలో గర్భిణులు, రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ ప్రవీణ్, పీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తి ఉన్న వారికే పట్టం

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమస్ఫూర్తి ఉన్న వారికే ఉపాధ్యాయుల పట్టం కట్టారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. ఆమె మాట్లాడుతూ శాసనమండలిలో ఉపాధ్యాయుల హక్కులు కోసం పోరాడేందుకు ఉద్యమస్ఫూర్తితో ఉన్న యుటిఎఫ్ నాయకులు ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనమని తెలిపారు. శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతుగట్టిగా వినిపించేందుకు యుటిఎఫ్ ఉద్యమ నాయకులు గెలిపించిన ప్రతి ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు మహేష్, కార్యదర్శి మోహన్ రెడ్డి, కోశాధికారి బాలాజీ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విజయపురానికి చెందిన వందవాసి మహేష్ శర్మ సోమవారం విద్యాసామగ్రి అందించారు. విద్యార్థులకు కావలసిన పలకలు, క్రయాన్స్, పెన్నులు, పెన్సిల్ అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగేంద్రకుమారి, రిటైర్డు ఉపాధ్యాయులు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.




విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న వందవాసి మహేష్ శర్మ

బూచివానత్తంలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని బూచివానత్తం పంచాయతీలో సర్పంచ్ గోపాల్ సోమవారం పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు. గ్రామంలో వర్షానికి బురదమయమై మురుగునీరు నిలిచిన ప్రాంతాలలో మురుగునీ వీరు పోయే విధంగా ట్రెంచ్ కొట్టించారు. అలాగే మరమ్మతులకు గురైన పైప్‌లైన్లను రిపేర్ చేయించారు. రోడ్డుకు ఇరువైపు బ్లాంచింగ్ చల్లారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక పెన్షనర్ల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పాత బకాయిలు చెల్లింపు, హెల్త్‌కార్డుల మంజురు చేయాలన్నారు. పెన్షనర్ల సంఘం పాలక వర్గం, పెన్షనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు నాగరాజు

కనువిందు చేసిన శ్రీవారి కళ్యాణం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని తిరుపతి రోడ్డులో గల శ్రీభూనీలదేవి పరుష వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద సోమవారం ఉదయం నిర్వహించిన కళ్యాణ మహోత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఈనెల 8వ తేదీ సాయంత్రం తిరుకళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను అంకురార్పణతో ప్రారంభించి సోమవారం భక్తజన సందోహం నడుమ అంగరంగ వైభవంగా వేదమంత్రాల సాక్షిగా శ్రీ భూనీల దేవి పరుష వెంకటేశ్వరస్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక అలంకరణలు చేసి అనంతరం కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తదుపరి భక్తులకు తీర్థప్రసాద వినియోగానంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

'మన్నవరం'లో మిగిలిన
భూమి ప్రభుత్వానికి అప్పగించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్బిపిపిఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తే నూతన పరిశ్రమల స్థాపనకు, వాటి అవసరాలకు కేటాయించుటకు అవకాశం ఉంటుందని శ్రీకాళహస్తి మన్నవరం ఎన్బీపీపీఎల్ ప్రతినిధులకు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ నుండి వర్చువల్ విధానంలో పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్, ఎండి ఏపిఐఐసి అభిషిక్త కిషోర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌లతో కలిసి ఎన్బిపిఎల్ పరిశ్రమల ప్రతినిధులతో వర్చువల్ విధానంలో సదరు పరిశ్రమలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాల అంశంపై సమీక్ష నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలో సదరు అంశం ఉందని తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పలమనేరు ఆర్‌డిఓ భవాని



ప్రజాశక్తి- చౌడేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారిని భవాని తెలిపారు. సోమవారం మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసముద్రం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల సాధనకు రెవెన్యూ సదస్సులు వేదికలుగా ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యను బట్టి కాలపరిమితి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు వ్యక్తిగత సామాజిక సమస్యల సైతం పరిష్కరించబడతాయని తెలిపారు. సదస్సులో వన్ బి, సర్వే నంబర్ల గల్లంతు, సరిహద్దులు, ఆర్ఓఆర్ వంటి సమస్యలతో రైతులు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఆమెను శాలువ, పూలమాలతో పలువురు సత్కరించారు. తహశీల్దార్ హనుమంతు, డిప్యూటి తహశీల్దార్ మాధవి, ఆర్ఐ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, మాజీ సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం: తహశీల్దార్

కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ అడవి ములకలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని తహశీల్దార్ చిట్టిబాబు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్తులు విన్నపం మేరకు ఓంశక్తి ఆలయ నిర్మాణంకి స్థల పరిశీలన చేసి సమస్యకు పరిష్కారం చూపించడం జరిగింది. అలాగే రైతులు తమ భూ సమస్యల పై 26 అర్జీలు ఇవ్వడం జరిగింది. వీటన్నింటిని పరిశీలించిన తహశీల్దార్ రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, క్లస్టర్ ఇంచార్జి మహేంద్ర బాబు, ఆర్ఐ వేణుగోపాల్, విఆర్ఓ మహేష్ పాల్గొన్నారు.

ఎస్వీయూ స్టాఫ్ గేమ్స్‌లో నగరి డిగ్రీ కళాశాల ప్రతిభ

ప్రజాశక్తి- విజయపురం (నగరి)

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈనెల 8వ తేదీన జరిగిన యూనివర్శిటీ స్టాఫ్ గేమ్స్‌లో టెన్నిస్ సింగిల్స్ విభాగంలో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రాజనీతిశాస్త్ర విభాగం ఇంచార్జ్ డాక్టర్ భాస్కర్‌రాజు రన్నర్‌గా నిలిచారని, అదేవిధంగా త్రోబాల్, బాల్ బ్యాడ్ మింటన్ మహిళా విభాగంలో బాటని అధ్యాపకురాలు డాక్టర్ అరుణకుమారి టీమ్ రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలియజేశారు. ఈసందర్భంగా అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్ట భాస్కర్‌రాజు, ఎన్‌సిసి ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ డాక్టర్ వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు విజేతలను అభినందించారు.



పంచాయతీ సిబ్బందికి ఘనసన్మానం

ప్రజాశక్తి- ఐరాల: మండలం పరిధిలోని బొమ్మసముద్రం పంచాయతీకి జాతీయస్థాయిలో ఉత్తమ హెల్తీ పంచాయతీగా ఎంపికైన విషయం అందరికీ తెలిసిందే. దీనికి కారకులైన బొమ్మసముద్రం పంచాయతీ సెక్రటరీ, సిబ్బందికి, సర్పంచ్, పిహెచ్‌సి సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ రావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఉత్తమ హెల్తీ పంచాయతీ అవార్డు పొంది ఈ జిల్లాలో గుర్తింపు తెచ్చుకోవడం చాలా గర్వకారణమని ఇందుకు కృషిచేసిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు ఎన్నో తెచ్చుకోవాలని, జిల్లాలో అన్ని పంచాయతీలు మంచి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని దానికి తగిన సహాయ సహకారాలు ఎల్లపుడూ అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఓ పార్వతి, ఈవోపిఆర్‌డి కుసుమ కుమారి, సర్పంచ్ రఘు, ఎంపిడిఓ ధనలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ మౌనిక , పిహెచ్‌సి అధికారి డాక్టర్ స్వాతి సింధూర, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు, ఎంపీటీసీ విజయ్ కుమారి, జనసేన నాయకులు ఎం.మహేష్ స్వేరో పాల్గొన్నారు



సర్పంచ్‌ను సన్మానిస్తున్న డిపిఓ సుధాకర్, డిఎల్‌పిఓ పార్వతి

ఎస్సీ, ఎస్టీ చట్టాలు, హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ శ్రీనివాసులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన డివిజినల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్లుగా కుప్పం నియోజకవర్గ నాలుగు మండలాలు కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల తహశీల్దార్లు ఎంపీడీవోలు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో, కుప్పం ప్రాంతంలో ప్రజల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, అధికార గణం మెంబర్లుగా ఉంటూ ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ కోసం, వారికి ఉన్న చట్టాలు హక్కుల కొరకు అవగాహన కల్పించడం, న్యాయమైన సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేసేటట్లు చర్చించి తీర్మానించడం జరిగింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల చట్టాలు హక్కుల వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన బాధ్యత కమిటీ ప్రతినిధులు బాధ్యతతో నిర్వహించాలని ఆర్డీవో కోరారు. ఈ సమావేశంలో డివిఎంసి మెంబర్లు కుప్పం మండల అభివృద్ధి అధికారి సాయి లహరి, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారి మీనాక్షి, ఆర్డీవో కార్యాలయం ఏవో, దళిత యువజన సేవాసమితి ఫౌండర్ కే.కన్నన్, కుప్పం మున్సిపాలిటీ కౌన్సిలర్ జగదీష్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి కెసి.గోవిందరాజులు పాల్గొన్నారు.

అదానీ ముడుపుల వ్యవహారం నిగ్గు తేల్చాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్ధన్

ప్రజాశక్తి- పుంగనూరు

విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అదాని నుండి ప్రభుత్వ నేతలకు భారీగా ముడుపులు అందాయని ప్రపంచ వ్యాప్తంగా గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి.జనార్ధన్ డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు సోమవారం పుంగనూరు మండల కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కుంభకోణాల వలన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రితో సహ పలువురికి ముడుపులు ముట్టిన నేపథ్యంలో రాష్ట్రప్రజలపై లక్ష కోట్లకు పైగా భారం పడబోతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ట్రూ అప్ చార్జీల పేరున ప్రభుత్వాలు నెలవారి రూ.200 నుంచి 500లు దాకా బిల్లులు పెంచారని, ఈ కుంభకోణంతో మరింతగా ప్రజలపై భారం పెరిగే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ సామాన్ల, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తు స్తోందని ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం తీసుకొచ్చేందుకు సిపిఐ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రామ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మున్నా, మన్సూర్, సోము, కిషోర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

సినిమా పేరుతో బాలికపై లైంగిక దాడి

ప్రజాశక్తి- కార్వేటినగరం

సినిమా పేరుతో బాలిక (17)పై లైంగిక దాడి చేసిన సంఘటన కార్వేటినగరం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఇలా ఉన్నాయి. మండలంలోని గోపిశెట్టిపల్లి దళితవాడకు చెందిన ఓ యువకుడు, కత్తెరపల్లి దళితవాడకు చెందిన బాలికను ఆదివారం రాత్రి తమిళనాడులోని పళ్లిపట్టులో సినిమాకు తీసుకెత్తానని మాయమాటలు చెప్పి నమ్మించి ఇంటి నుంచి తీసుకెళ్లాడు. అర్థరాత్రి నిర్మానుష్యమైన ప్రదేశంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తిరిగి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పడంతో సోమవారం రాత్రి బాలిక తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి విషయాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికీ గాయాలైన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కేజీ సత్రం వద్ద చోటు చేసుకున్నది. ఏఎస్ఐ మల్లప్ప ఇచ్చిన సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రం పరదరామి పోస్ట్ పూజారవలస గ్రామానికి చెందిన మేకనాథం, రాకేష్ బంగారుపాళ్యం మండలం వెంకటాపురం గ్రామానికి తాపీ మేస్త్రి పని కోసం వచ్చి తిరిగి వెళుతుండగా కేజీ సత్రం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోవడంతో స్థానికులు టోల్‌గేట్ వారికి సమాచారం అందించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో ఇరువురికి తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని మంగుంట గ్రామంలో 10 గ్రాముల బంగారం, రూ.20వేల నగదు దోచుకెళ్లిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 197 రామాపురం, గుడిపాల మండలం చిత్తూరు జిల్లాకు చెందిన ఎన్.రమేష్ కుమారుడు ఆర్.రాజేష్ శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని మంగుంట గ్రామపంచాయతీ మంగుంట గ్రామంలోని బి.భువనేశ్వరి ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 10 గ్రాముల బంగారం, రూ.20వేలు నగదును దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం సాయంత్రం అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



నిందితుడిని చూపిస్తున్న ఎస్సై సుమన్

వైద్య అధ్యాపకులకు శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా ఎస్ వి వైద్య కళాశాలలో వైద్య అధ్యాపకులకు, బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం, తమిళనాడు సీ.ఎం.సి వేలూరు వైద్య కళాశాల వారి ఆధ్వర్యంలో డిసెంబర్ 09 నుండి 11 వరకు నిర్వహించబడునని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 30 మంది వైద్య అధ్యాపకులు వైద్య విద్య బోధనలో నూతన పద్ధతులు గురించి పూర్తి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.ఎస్.కిరీటి, సిఎంసి వేలూరు వైద్య కళాశాల (అబ్జర్వర్) పర్యవేక్షకులు డాక్టర్ రమ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి -రేణిగుంట: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకట రత్నం ఆదేశానుసారం, పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు సూచన-సలహాల మేరకు ఇందిరా నగర్, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్‌ఆవరణలో సోమవారం రాస్ టాటా ట్రస్ట్ వారిచే, ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన మహిళలకు - పురుషులకు డాక్టర్ వెంకయ్య బాబు బృందం క్యాన్సర్ పై పూర్తి అవగాహన కల్పించి ,అందరూ అన్ని పరీక్షలను తప్పక చేసుకునే విధంగా ,వారి ఆరోగ్యం పై ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలను అందించారు. టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు బృందం,సిబ్బంది హేమంత్ కుమార్ ,రెడ్డికుమారి, అమరావతి , మహేంద్ర, రాస్ మహిళా జ్యోతి ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్బలగన్ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్-హిరోషిమా బృందం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, విభిన్న ఉత్పాదక రంగాలలో అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రంగా దీని సామర్థ్యం, ఇక్కడ పరిశ్రమలు స్థాపించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రదర్శన ద్వారా వారికి వివరించారు. 30కి పైగా జపనీస్ కంపెనీల స్థాపనతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు పొందడం శ్రీసిటీ ప్రత్యేకతగాపేర్కొన్నారు.

11 నుంచి మార్కెట్లో 'స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: 'ఫాస్టెస్ట్ స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13' డిసెంబర్ 11వ తేదీ నుంచి అందుబాటులో కలదని ఐక్యూ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిపున్ మరియా తెలిపారు. ఈఫ్లాగ్‌షిప్ పరికరం సాటిలేని పనితీరు, అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్‌తో ఉంటుందన్నారు. ఐక్యూ ధర 12జీబీ-256జీబీ వేరియంట్ రూ. 54,999 (సమర్థవంతమైన ధర 51,999), 16జీబీ-512జీబీ వేరియంట్ రూ.59,999 (సమర్థవంతమైన ధర 56,999)లో ఉందన్నారు. నో-కాస్ట్ ఈఎంఐ, 9నెలల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.